పేదలకు వరం సీఎం సహాయ నిధి



ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 12 : పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయ నిధి ఎంతో మేలు చేస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కాలేయ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లింగోజిగూడ డివిజన్ అల్తాఫ్ నగర్‌కు చెందిన వెంకటేశ్వర్‌రావు చికిత్స కోసం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 1.50 లక్షల ఎల్వోసీని బాధితుడి అల్లుడు సత్యనారాయణకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలు పొందేందుకు సీఎం సహాయ నిధి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

లలితానగర్‌కాలనీలో..

మన్సూరాబాద్, ఫిబ్రవరి 12: పేదలకు సీఎం సహాయనిధి ఎంతో తోడ్పాటునందిస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధి లలితానగర్ కాలనీకి చెందిన లావణ్య వెన్నెముక సమస్యతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానలో వైద్య పరీక్షలు చేయించుకుంది. వెన్నెముక ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ. 1.50 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఎల్వోసీ పత్రాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదన్నారు. చిరంజీవి, సత్యంచారి పాల్గొన్నారు.

నల్గొండ సభను జయప్రదం చేయాలి

సైదాబాద్, ఫిబ్రవరి 12: కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, కేంద్రం నుంచి తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు మంగళవారం చేపట్టిన చలో నల్గొండ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఐఎస్ సదన్ డివిజన్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నల్గొండ పట్టణంలో జరిగే చలో నల్గొండ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హాజరవుతారని ఆయనకు స్వాగతం పలికేందుకు కార్యకర్తలందరూ ముందుగా నగరంలోని తెలంగాణ భవన్ చేరుకోవాలని, అక్కడి నుంచి నల్గొండలో జరిగే బహిరంగ సభకు తరలివెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విజయవంతం చేయాలి...

ఆర్కేపురం: జల హక్కులు కాపాడేందుకు నేడు నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పిలుపునిచ్చారు. సోమవారం గ్రీన్‌హిల్స్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు చలో నల్గొండ సభకు మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంస్థ నాయకులు, సబితమ్మ అభిమానులు పాల్గొనాలని కోరారు.

కార్యకర్తలు తరలిరావాలి..

బడంగ్‌పేట: మాజీ ముఖ్య మంత్రి చంద్ర శేఖర్ రావు పిలుపు మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు చలో నల్లగొండ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు భారీ బహిరంగ సభ ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు , అను బంధసంఘాల నాయకులు, అభిమానాలు తరలి రావాలన్నారు. మహేశ్వరం, కందుకూరు మండలాల నుంచి, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల నుంచి, మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి, సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సభను విజయ వంతం చేయాలని ఆమె కోరారు.

కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలి

బడంగ్‌పేట, ఫిబ్రవరి12: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 110, 119లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని భీమ్ రావు వెల్ఫేర్ అసోసియేషన్ బడంగ్‌పేట అధ్యక్షుడు కర్రె కృష్ణ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవోకు సోమవారం ఫిర్యాదు చేశారు. గతంలో ప్రభుత్వం ఇండ్ల పట్టాలకు ఇచ్చిన భూమి పోగా మిగులు భూమి ఎంత ఉందో సర్వే చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూమికి ప్రైవేట్ సర్వే నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూమి లే అవుట్ చేసి అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొంత మంది నాయకులు ప్రభుత్వ భూములు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

బుల్లెట్ బైక్‌ను ఎత్తుకెళ్లిన ఇద్దరు దొంగలు అరెస్ట్

హయత్‌నగర్, ఫిబ్రవరి 12 : పార్కింగ్ చేసిన బుల్లెట్ బైక్‌ను ఎత్తుకెళ్లిన ఘటనలో ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నిరంజన్ తెలిపిన వివరాల ప్రకారం.. యానాంకు చెందిన మణికంత, అరవింద్ నగరానికి వచ్చి ఎర్రమంజిల్‌లో నివాసముంటున్నారు. ఈనెల 2న హయత్‌నగర్‌లోని హయత్‌భక్షి మసీదు పక్కన మీర్జా అర్షద్‌బేగ్ తన ఇంటి ముందు బుల్లెట్ బైక్‌ను పార్కింగ్ చేశాడు. అదే రోజు రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బుల్లెట్‌ను మణికంత, అరవింద్ ఇద్దరు కలిసి ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహించి ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కార్పొరేటర్ పర్యటన

ఉప్పల్: చిలుకానగర్‌లోని కుమ్మరికుంటకాలనీలో కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ సోమవారం పర్యటించారు. ఈసందర్భంగా కాలనీ వాసులతో కలిసి, పర్యటించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదనీటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు

ఆర్చిడ్ కాలనీలో బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట, ఫిబ్రవరి12: దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తామని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లో ఉన్న ఆర్చిడ్ కాలనీలో బీటీ రోడ్డు పనులను వారు సోమవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. లక్షల రూపాయాలు వెచ్చించి వేస్తున్న రోడ్లు నాలుగు కాలాల పాటు ప్రజలకు ఉపయోగ పడే విధంగా ఉండాలన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనులు చేస్తున్న క్రమంలో అధికారులు తప్పని సరిగా ఉండాలన్నారు. అధికారుల పర్యావేక్షణ లేకుంటే నాణ్యత లోపిస్తుందన్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీ వాసులు ఉన్నారు.

తుక్కుగూడ అభివృద్ధికి అంచనా బడ్జెట్ రూ.25కోట్లు

బడంగ్‌పేట, ఫిబ్రవరి12: తుక్కుగూడ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం చైర్మన్ కాటే కార్ మధుమోహన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. 2023, 2024సవరణ బడ్జెట్, 2024,2025 సంవత్సరం అంచనా బడ్జెట్ సభలో ప్రవేశ పెట్టారు. మొత్తం రూ. 25.16 కోట్లు అంచనా బడ్జెట్ ఆమోదించి అందులో సీసీ రోడ్లు, భూగర్బ డ్రైనేజీ అభివృద్ధి పనులకు రూ.4.94 కోట్లు, సిబ్బంది జీత భత్యాలు రూ.3.70కోట్లు, గ్రీన్ బడ్జెట్ రూ.1.79కోట్లు, 1/3బాలన్స్ బడ్జెట్ రూ.2.54కోట్లు, పారిశుధ్యం నిర్వహణ కోసం రూ.1.48కోట్లు, అడ్మిని స్టేట్ నిర్వహణకు రూ.0.82కోట్లు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భవాని వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, కౌన్సిలర్లు యాదిరెడ్డి, అనిత జయ రాజు, శివకుమార్, పద్మశివయ్య, బూడిద తేజస్వీ శ్రీకాంత్ గౌడ్, విలాస్, సుమన్, భావన సుధాకర్, రాజు అధికారులు తదితరులు ఉన్నారు.

బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

కాప్రా, ఫిబ్రవరి 12: కృష్ణాబేసిన్ ప్రాజెక్టులను కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (కేఆర్ఎంబీ) కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ మంగళవారం నల్లగొండలో జరిగే బహిరంగ సభకు భారీగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈమేరకు నల్లగొండ సభకు తరలి రావాలని కోరుతూ పోస్టర్లను సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో బీఎల్ఆర్ ఆవిష్కరించారు.

క్యాంపు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నగేశ్

ఆర్కేపురం, ఫిబ్రవరి 12 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, చిత్రలేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నగేశ్ అన్నారు. ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెనెట్ డైగ్నోస్టిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో థైరాయిడ్, కొలెస్ట్రాల్, బీపీ, రక్త పరీక్షలతో పాటు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి వైద్య శిబిరాలు కాలనీలో మరిన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోదా కృష్ణారెడ్డి, యాదగిరిరావు, టెనెట్ ప్రతినిధులు శ్రీకాంత్, రమేశ్ పాల్గొన్నారు.

వైభవంగా రాజరాజేశ్వరి కల్యాణం

కల్యాణ మహోత్సవానికి హాజరైన నాయకులు, భక్తులు

కందుకూరు. ఫిబ్రవరి 12 : మండల పరిధిలోని కొత్తగూడ గ్రామంలో రాజరాజేశ్వరి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం గణపతి పూజ ,అఖండ దీపారాధన, నవగ్రహ,స్వస్తి పుణ్యాహవచనం, రుద్రస్నైత, హోమాలు అనంతరం నిర్వహించిన అనంతరం రాజరాజేశ్వరి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను గ్రామంలో గల నర్సింహ స్వామి ఆలయం వరకు సేవ నిర్వహించి తిరిగి దేవాలయానికి తీసుకువచ్చారు. కుర్మేటి సూర్యప్రకాశ్ శర్మ, క్రిష్ణమూర్తి శర్మ, ప్రవీణ్ ప్రదీప్, శ్రీధర్ శర్మ, చంద్రశేఖర్ పండితులు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, చంద్రమౌళి గుప్త, శ్రీనివాస్ గుప్త, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు బొక్క మాధవరెడ్డి, సాధ మల్లారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బొక్క నర్సింహారెడ్డి, బొక్క ఎల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్త, నర్సింహాచారి, బొక్క అభినవ్‌రెడ్డి, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

15న సేవాలాల్ మహారాజ్ జయంతి

వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐ మక్బూల్ జానీ

కందుకూరు. ఫిబ్రవరి 12 : ఈ నెల 15న నిర్వహించే సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో వివిధ తండాల నుంచి వచ్చిన గిరిజనుల తో కలిసి కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ మక్బూల్ జానీ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతి ఉత్సవాల్లో భాగంగా శోభా యాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అసౌర్యం కల్గించవద్దని పేర్కొన్నారు. ఉత్సవాలను జయప్రదం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రఘురాం రాథోడ్, భీంలాల్ పవార్, రాజు నాయక్, బాణావత్ నాయక్, బాలునాయక్, మాణిక్యం నాయక్, రవి నాయక్, భీమా నాయక్, రాజేశ్‌నాయక్, కిరణ్ నాయక్, శ్రీకాంత్ నాయక్, శ్రీను నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు కబ్జా చేస్తే చర్యలు తప్పవు

చర్లపల్లి, ఫిబ్రవరి 12: ప్రభుత్వ స్థలాలు, పార్కులను కబ్జాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి హెచ్చరించారు. చర్లపల్లి డివిజన్, మధురానగర్‌లోని పార్కులో నిర్మించిన అక్రమ కట్టడాన్ని సోమవారం సంబంధిత అధికారులు కూల్చివేయిం చా. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాలలో దరఖాస్తుల గడువు పొడిగింపు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 12: ఎల్బీనగర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల (బాలానగర్ గర్ల్స్ బ్రాంచ్)లో 2024–25లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తుల గడువును ఏప్రిల్ వరకు పొడిగించడం జరిగిందని ప్రిన్సిపాల్ వినీల తెలిపారు. ఇంటర్మీడియట్ సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. మైనార్టీ, నాన్ మైనార్టీ కోటాలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు నంబర్లు 9160255040, 9154365042 సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. మెయిల్ ఐడీ: tmrjcbalanagargirls1@gmail.comలోను వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ప్రజావాణిలో ఐదు ఫిర్యాదులు

ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 12 : ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ ప్రజావాణిలో మొత్తం ఐదు ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు. ఈ ఐదు దరఖాస్తుల్లో టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన 2 ఫిర్యాదులు, అర్బన్ బయోడైవర్సిటీ విభాగానికి సంబంధించి 3 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదులను ఆయా విభాగాల ఉన్నతాధిరులకు పంపామని త్వరలోనే పరిష్కరించునున్నట్లు తెలిపారు.

బండ్లగూడలో...

బండ్లగూడ: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ముందంజలో ఉండి పనిచేస్తున్నట్లు ఉప కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఆయన పలువురి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఈస్ట్‌జోన్ ఎంవీఐలు రమేశ్‌బాబు, నరేంద్ర పాల్‌సింగ్

మలక్‌పేట, ఫిబ్రవరి 12: రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఈస్ట్‌జోన్ ఎంవీఐ రమేశ్‌బాబు డ్రైవర్లకు, వాహనచోదకులకు, దరఖాస్తుదారులకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జేటీసీ రమేశ్ ఆదేశాల మేరకు సోమవారం ఈస్ట్‌జోన్ ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీవో సుభాశ్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వాహనచోదకులకు, దరఖాస్తుదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రమేశ్ బాబు మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గత నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రతపై ప్రజలకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించటం జరిగిందని ఆయన తెలిపారు. మీడియా ప్రతినిధులు కూడా తమ వంతు బాధ్యతగా రోడ్డు భద్రతపై కథనాలు ప్రచురించి ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని ఆయన కోరారు. ఫిట్‌నెస్ వాహనాలను రోడ్లపై తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటించాలని, సామర్థ్యానికి మించి పాఠశాల విద్యార్థులనుగానీ, ప్యాసింజర్లనుగానీ ఆటోల్లో ఎక్కించుకోవద్దని సూచించారు. ప్రతి వాహనానికి ఫిట్‌నెస్, బీమా, పొల్యూషన్ పత్రాలు తప్పక ఉండాలన్నారు. ఆటోల్లో ఆరుగురికి మించి పిల్లలను ఎక్కించుకోరాదని, ఇంటినుంచి పాఠశాలకు, పాఠశాలనుంచి ఇంటికి పిల్లలను జాగ్రత్తగా తీసుకెళ్లాలని సూచించారు. పిల్లలను ఆటోల్లో పాఠశాలకు పంపించే తల్లిదండ్రులు వాహనాల నాణ్యత, భద్రతపై ఎప్పటికప్పుడు వాకబు చేస్తే ప్రమాదాల బారిన పడకుండా రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు రమేశ్‌బాబు, నరేంద్ర పాల్‌సింగ్, ఉమ, అరుణ, మున్నీ, ఏఎంవీఐలు రజనీ, సైదా ఏఓలు విజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మధుకర్, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది జైపాల్‌రెడ్డి, చిరంజీవి కుమార్, గిరిబాబు, గౌస్‌పాషా, సుజాతదేవి, శైలజ, విమలాకుమారి, శైలజ, ఎంఎం బేగ్, శ్రీకాంత్, వినయ్, అరుణ, విజయ, అరుణ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

అమరేందర్

కందుకూరు ఫిబ్రవరి 12 : రంగారెడ్డి జిల్లా ధర్మ సమాజ్ పార్టీ కన్వీనర్‌గా మండల పరిధిలోని బేగంపేట్ గ్రామానికి చెందిన అమరేందర్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సమావేశం అయిన అనంతరం రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆయనను నియమిస్తున్నట్లు ప్రకటించారు.కో కన్వీనర్‌గా నాగార్జున ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధర్మ సమాజ్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ధర్మ సమాజ్ పార్టీ పేద ప్రజలను ఆదుకోవడానికి కృషి చేస్తుందని చెప్పారు. పార్టీలో పని చేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని తెలిపారు.

అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌పై దాడి సరికాదు

ఆర్కేపురం, ఫిబ్రవరి 12: అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని, ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని సరూర్‌నగర్ ఆర్యవైశ్య సంఘం మీడియా కమిటీ చైర్మన్ శ్రీకాకోళ్ల రాజుగుప్త అన్నారు. సోమవారం ఆర్కేపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యులు మార్కెట్ చైర్మన్‌గా ఉండడం కొందరు జీర్ణించుకోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. సమాజంలో అన్ని కులాలతో పాటు వైశ్యలకు కూడా రాజకీయాల్లో ఉండేందుకు హక్కు ఉందన్నారు. తుకాలలో మోసాలు జరిగితే, గిట్టుబాటు ధర లభించక పోతే చైర్మన్‌కు, సెక్రటరీకి కానీ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి కానీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. రైతులు ఆమెను కొట్టుకుంటూ తీసుకురావడం అమానుషమైన చర్య అన్నారు. ఇప్పటివరకు ఎందరో అచ్చంపేట మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్‌లుగా చేసిన వారు ఉన్నారు. కానీ ఏ మార్కెట్ చైర్మన్ పై కూడా దాడి చేయలేదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేయాలన్నారు.

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

ఉడుంగడ్డ ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను పరిశీలిస్తున్న నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు కుమారస్వామి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 12: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి కోరారు. మైలార్‌దేవపల్లి డివిజన్ ఉడుంగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, నవ యువ యూత్ క్లబ్ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. అనంతరం, కుమారస్వామి మాట్లాడుతూ పాఠశాలకు ఎత్తైన ప్రహరీ లేక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు గోడదూకి లోనికి ప్రవేశిస్తున్నారన్నారు. దర్వాజలు, ఇతర వస్తువులను ధ్వంసం చేసి విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో స్లాబ్ పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు పడిపోతుందో తెలియని స్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరువ చూపాలని కోరారు. దాతలు ముందుకు వచ్చి పాఠశాలల అభివృద్ధికి చేయూత అందించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రమేశ్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ నరేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహార వినియోగమే ప్రధానం

మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డా.వెంకటరమణ

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 12: ప్రస్తుత పరిస్థితులలో పోషకాహార వినియోగం ఎంతో అవరమని, భవిష్యత్ తరాలకు ప్రణాళిక ఉండేలా మనందరి కృషి ఉండాలని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. వెంకటరమణ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వర్సిటీ పరిధిలోని సమావేశపు మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ విద్యను ఎంపిక చేసుకుని బాధ్యతగా శిక్షణ పూర్తి చేసిన వారిని అభినందించారు. భవిష్యత్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి మార్గాలే ఎక్కువన్నారు. కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్, వ్యాల్యూ చైన్‌పై మల్టీ డిసిప్లినరి విధానం ఉండాలని, భవిషత్‌లో సహకారానికి అవకాశాలను అన్వేశించడానికి ఇంటర్ ఇనిస్టిట్యూట్‌ల అనుసంధానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ప్రభుత్వ రంగాలు గృహ ఆధారిత విలువ గొలుసులను అభివృద్ధి చేయడంలో దృష్టి కేంద్రీకరించాలన్నారు. కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ వి. విజయలక్ష్మి పోషకాహార లోపం ఆహార ఉత్పత్తి, ప్రాసెసింగ్ యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సూక్ష్మ లోపాలను తగ్గించడం, పోషకాహార లోపాలను ఎదుర్కోవడానికి పోషకాహారం అధికంగా ఉండే ఆహార వినియోగంపై కోర్స్ డైరెక్టర్ డా.టి. కమలజ శిక్షణ నివేదికను సూచించారు. పీజేటీఎస్ ఏయూ విశ్వవిద్యాలయం అధికారులు కమ్యూనిటీ సైన్స్ విభాగానికి చెందిన అధిపతులు, వివిధ ఐసీఏఆర్,ఎస్ఏయూలకు చెందిన 15 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. కోర్స్ సమన్వయకర్తలు డాక్టర్ శ్వేత, ఆర్ఎంసీఎస్ విభాగం, సీసీఎస్సీ, కార్యక్రమానికి ఏఐసీఆర్‌పీ – డబ్ల్యూఏ శాస్త్రవేత్తలు తదితరులు హాజరయ్యారు.